క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరడిగొండ: నేరడిగొండ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్ పనులు ఉండటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు ఎంపీ రాక

బోథ్: మండలంలోని పట్నాపూర్ గ్రామానికి శుక్రవారం ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ రానున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు బోరె రవీందర్ తెలిపారు. గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

ఆర్థిక సాయం

ఉట్నూర్‌రూరల్: రహెమాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన జక్కుల అడెల్లు లక్ష్మి దంపతుల కుటుంబానికి రూ. 10 వేలు అందచేయడం జరిగిందని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఆర్థిక పరిస్థితితో బాగోలేక వారు పడుతున్న కష్టాలను గుర్తించి తమవంతు సహకారం అందించడం జరిగిందన్నారు.

పరామర్శ

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రమానికి చెందిన మాజీ సర్పంచ్ ఆకుల రాజేందర్ మాతృమూర్తి ఇటీవల మతి చెందడంతో ఆ కుటుంబాన్ని డీసీసీబీ అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన లక్ష్మణ్ నానమ్మ మృతి చెందిన విషయం తెలుసుకుని పరామర్శించారు. వెంట ప్రముఖ యువ నాయకులు కోల శ్రీకాంత్, బొడ్డు శ్రీనివాస్, అల్లకొండ ప్రశాంత్ ఉన్నారు.

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన పురోహితుడు రాజు పంతులు కూతురు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని టీఎక్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అక్కడికి చేరుకొని ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్‌టౌన్: గాండ్ల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆవిష్కరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం సభ్యులు జోగు రామన్నను శాలువాతో సత్కరించారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన 22 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గురువారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వచ్చిన యువతి కనిపించకుండా పోయింది. తల్లి చూసే సరికి ఇంట్లో లేకపోవడంతో చుట్టుపక్కల గాలించింది. ఆచూకీ లభించకపోవడంతో టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఏటీఎం చోరీకి విఫలయత్నం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి విఫలయత్నం చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి ఏటీఎంలోకి చొరబడి మిషన్‌ను పగలగొట్టేందుకు యత్నించాడు. మిషన్ దెబ్బతినడంతో అక్కడినుంచి పరుగులు తీశాడు. యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ నోముల పంకుష్ రెడ్డి గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

తాంసి: మండల ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి రూ.5 వేల నగదును విరాళంగా అందజేశారు. నేరడిగొండ ప్రభుత్వ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న పాటిల్ నాగోరావు గురువారం హెచ్‌ఎం ఆశారెడ్డికి అందజేశారు. ఉపాధ్యాయులు కవిత, సరిత, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర ఉన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మలో మల్లికార్జున ఆలయం ఆవరణలో గురువారం సాముహిక మరుగుదొడ్ల నిర్మాణానికి స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ చంపత్ గ్రామస్తులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ 3 లక్షలతో స్వచ్ఛ భారత్ నిధుల నుంచి మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ఆవరణలో భక్తుల కోసం మరుగుదొడ్లను పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు.

కూరగాయల సాగులో ఆదర్శం

- తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు
- నేరుగా రైతుబజార్‌లో విక్రయం



రైతుబజార్‌లో విక్రయిస్తున్న లింగి రైతులు



సాగు చేస్తున్న టమాట

తలమడుగు: ఉన్న కొద్దిపాటి భూమిలో రైతులు వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తూ.. అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. కాలం ఏదైనా కూరగాయలు సాగు చేసి అధిక లాభాలు అర్జిస్తున్నారు. మండలంలో లింగి, కుచూలాపూర్, బరంపూర్, దేవాపూర్ గ్రామాల్లోని ఎక్కువగా కూరగాయల సాగుపై దృష్టి సారించారు. రబీలో వేరుశనగ, సాగు చేస్తునే మరోపక్క ఎకరం రెండు ఎకరాల్లో కూరగాయలు పండిస్తున్నారు. బావులు, బోరు బావుల్లో సమృద్ధిగా నీరు ఉండడంతో ఆసక్తి చూపుతున్నారు.

20 ఏళ్లుగా సాగు..

మండలంలో లింగి గ్రామంలో గత 20 ఏళ్లుగా కూరగాయలు సాగు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో రైతుబజార్ ఏర్పాటు చేసినప్పటి నుంచి పండిస్తున్నారు. మండలంలో గత ఏడాది దాదాపు 400 ఎకరాల్లో సాగు చేయగా.. ఈసీజన్‌లో మండలంలో 500 ఎకరాలల్లో పండిస్తున్నారు. ఎక్కువగా వంకాయ, టమాట, క్యాబేజీ, మిర్చి, బెండ, చిక్కుడు, కొత్తిమీర, మెంతికూర, పాలకూర, ఆకుకూరలు పండిస్తున్నారు. రైతులు స్వయంగా విక్రయిస్తూ మంచి లాభాలు గడిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని రైతు బజార్లో నాణ్యమైన కూరగాయలు తీసుకురావడంతో మంచి డిమాండ్ పెరిగింది. వీరిని చూసి ఇతర గ్రామాల రైతులు ఆదర్శంగా తీసుకుంటున్నారు. నీటి సౌకర్యం తక్కువగా ఉన్న చోట రైతులు బిందు సేద్యం చేస్తున్నారు. కూరగాయలకు మంచి డిమాండ్ ఉండడంతో రైతులు సాగు చేస్తూ మార్కెట్‌కు తరలించి అధిక లాభాలు పొందుతూ.. ఇతర గ్రామాల రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఏళ్లుగా సాగు చేస్తున్నాం



గత కొద్ది ఏళ్ల నుంచి కూరగాయలు సాగు చేస్తున్నాం. ఉదయం కోసి తర్వాత మార్కెట్‌కు తరలించాలి. ఇంట్లో వారందరూ కలిసి పని చేస్తే మంచి లాభాలు వస్తాయి. ఇంట్లో వాళ్ల పని చేస్తేనే లాభాలు పొందవచ్చు. కూరగాయలు చేతికి వచ్చే సమయంలో నిద్ర ఉండదు.

– అశోక్, రైతు

బస్సు సౌకర్యం కల్పించాలి



లింగి గ్రామం నుంచి కూరగాయలు తరలించేందుకు ఇబ్బంది అవుతుంది. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. గతంలో ఆర్టీసీ అధికారులు బస్సు నడిపేవారు, ప్రస్తుతం బస్సు సౌకర్యం లేక సాగు చేసే నానా ఇబ్బంది పడుతున్నాం.

– కిషన్, రైతు

కూరగాయలకు డిమాండ్

మండలంలో రైతులు మంచి నాణ్యమైన కూరగాయలు సాగు చేస్తున్నారు. పండించిన కూరగాయలను జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌తో పాటు రైతు బజార్‌లో తరలించి విగ్రహిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ప్రజలకు ఉదయం నుంచి కూరగాయలు అందిస్తున్నారు. కూరగాయల మార్కెట్ మంచి డిమాండ్ ఉంది.

– ప్రమోద్ రెడ్డి, ఏవో

108ను సద్వినియోగం చేసుకోవాలి



ప్రారంభిస్తున్న ఆదివాసీ పెద్దలు, వైద్య సిబ్బంది

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఆదివాసీ గిరిజన ఉద్యోగ సంఘం నాయకుడు మెస్రం శేఖర్ బాబు, జంగుబాయి దేవాలయ చైర్మన్ కొడప జాకులు అన్నారు. గాదిగూడ మండలానికి కేటాయించిన 108 అంబులెన్స్‌ను గురువారం లోకారి(కె) గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద 108 అంబులెన్స్‌కు పూజలు చేసి ప్రారంభించారు. గాదిగూడ మండలంలో అంబులెన్స్ లేక అత్యవసర సమయంలో ప్రజలు ఇబ్బంది పడేవారన్నారు. ఇటీవల ఝరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన రావడంతో కలెక్టర్ రాజర్షిషా అంబులెన్స్ కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏసీవో నితిన్‌కూమార్, మాజీ సర్పంచ్ ఉద్దేరాజు, ఏఎన్‌ఎం శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న బోనగిరి సౌజన్య

తాంసి: బాల బాలికలు హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బోనగిరి సౌజన్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షూర్ ఎన్జీవో ఆధ్వర్యంలో బాలల హక్కులు, బాల్య వివాహరహిత భారతదేశం అనే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం బాలికలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయన్నారు. లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో పిల్లలకు న్యాయసేవలు అందించేందుకు పారా లీగల్ వలంటీర్స్ నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వెంకటస్వామి, పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్, మహిళ సాధికారత జిల్లా కోఆర్డినేటర్ యశోద, షూర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ వినోద్, సూపర్‌వైజర్ కిరణ్ పాల్గొన్నారు.

శారదామాత బోధనలు అనుసరించాలి



పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

ఆదిలాబాద్: శ్రీరామకృష్ణ పరమహంస అర్ధాంగి అయిన శ్రీ శారదా మాత బోధనలను అనుసరించాలని శ్రీరామకృష్ణ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు భూమన్న అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం శారదా దేవి జీవితం– బోధనలపై విద్యార్థినులకు పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని ఈ ప్రపంచానికి శారదా దేవి చాటి చెప్పారన్నారు. దీనులకు, అభాగ్యులకు సేవ చేసినప్పుడే భగవత్ సాక్షాత్కారం కలుగుతుందని ఆమె బోధించారన్నారు. ఆమె జీవిత విశేషాలు, బోధనలు నేటి తరానికి తెలియజేయాలని ఉద్దేశంతో విద్యార్థులకు పరీక్షను నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి లేనిన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ భవన్ ముట్టడించిన బీజేపీ నాయకులు



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ, బీజేవైఎం నాయకులు గురువారం ప్రజాసేవ భవన్‌ను ముట్టడించారు. కంది శ్రీనివాస రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

అటవీ హక్కుల చట్టాలపై అవగాహన

ఉట్నూర్‌రూరల్: అటవీహక్కు చట్టాలపై నాగార్జున సాగర్‌లో బుధవారం జరిగిన అవగాహన, శిక్షణ శిబిరంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పాల్గొన్నారు. అటవీహక్కు చట్టాలపై ప్రసంగించారు. చట్టాలపై సుదీర్ఘ ఉపన్యాసం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అఖిల భారత కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్ కొప్పుల రాజు, ప్రొఫెసర్ హరగోపాల్ పాల్గొన్నారు.

సరస్వతి శిశు మందిర్ అభివృద్ధికి కృషి

నేరడిగొండ: మండల కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఏలేటి అశ్విన్ రెడ్డి అన్నారు. గురువారం పాఠశాలను సందర్శించారు. ఆయన వెంట పాఠశాల కమిటీ సభ్యులు పాల రాజేశ్వర్, బోథ్ మాజీ వైస్ ఎంపీపీ లింబాజీ, బోథ్ నియోజకవర్గ యూత్ వైస్ ప్రెసిడెంట్ గుడాల అనిష్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

ఖానాపూర్: ఉద్యమాల ద్వారానే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలతోపాటు మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్, కేజీబీవీలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకున్నారు.

చైనా మాంజా అమ్మితే చర్యలు

ఇంద్రవెల్లి: వ్యాపారస్తులు చైనా మాంజా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ టాక్స్‌ఫోర్స్ ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని దుకాణాలను తనిఖీ చేశారు. చైనా మాంజాల ద్వారా జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. పక్షులు చనిపోవడంతో పాటు మనుషులకు గాయలవుతాయన్నారు. అమ్మినట్లు తమ దృష్టికి వస్తే కేసులు నమోదు చేయడంతో పాటు లక్ష జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ టాక్స్‌ఫోర్స్ డిప్యూటీ ఆర్‌వో కవి, ఎఫ్ఎస్‌లు రాజేందర్, చంద్రారెడ్డి, ఎఫ్‌బీవోలు సౌజన్య, శ్యామ్‌సుందర్, జోంద్లే సంజయ్ పాల్గొన్నారు.


శబరి యాత్రకు బయల్దేరిన స్వాములు

బోథ్: మండలంలోని అయ్యప్ప స్వాములకు గురువారం శబరిమల యాత్రకు బయల్దేరారు. గత 42 రోజులుగా దీక్షలో ఉన్న అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వాములు ఇరుముడి కట్టి శబరియాత్రకు బయల్దేరారు.

ఎమ్మెల్యేకు గ్రామస్తుల ధన్యవాదాలు

బోథ్: మండలంలోని చింతలబోరి గ్రామంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసినందుకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల గ్రామంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరగా, వెంటనే ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆదివాసీల ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఉట్నూర్‌రూరల్: గోదావరి పద్మల్‌పూరి కాకో దేవస్థానంలో ఆదివాసీ సంప్రదాయంగా పూజలు చేసినట్లు మాజీ ఎంపీపీ జైవంత్‌రావు తెలిపారు. ఉట్నూర్ మండలం చింతగూడ గ్రామ గిరిజనులతో కలిసి దర్శించుకోవడం జరిగిందన్నారు. పుష్యమాసంలో ఆదివాసీలు భక్తిశ్రద్ధల మధ్య సంస్కృతి సాంప్రదాయాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్డి(బి)లోనే కొనసాగించాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

బోథ్: తమ గ్రామాన్ని పార్డి(బి) గ్రామ పంచాయతీలోనే కొనసాగించాలని పరుపుల పల్లె గ్రామస్తులు గురువారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. కాగా తమ గ్రామాన్ని ఇతర పంచాయతీలో విలీనం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జగ్నక్ మారుతి, అత్రం ధర్మన్న, పెందూర్ సుంగన్న, అర్క గంగన్న, ఆత్రం నాగరావు, రవి, జగదీష్, గంగారాం, బాదిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పాఠశాలపై వ్యాసరచన పోటీలు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలో అమలు చేస్తున్న ఆరోగ్య పాఠశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించినట్లు ఆదిలాబాద్ రూరల్, అర్బన్, మావల ఎంఈవోలు కంటె నర్సయ్య, సోమయ్య, సరోజలు అన్నారు. గురువారం ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గల స్త్రీ శక్తి భవనంలో ఆదిలాబాద్ అర్బన్, ఆదిలాబాద్ రూరల్, మావల మండలాల విద్యార్థులకు మండలస్థాయి ఆరోగ్య పాఠశాల కార్యక్రమంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆయా మండలాల నుంచి 23 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఒక్కొక్క మండలం నుంచి ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. వీరు ఈనెల 20న జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

నాగపూర్ గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం



విద్యార్థులతో మాట్లాడుతున్న గజేందర్

బోథ్: నాగపూర్ గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. గురువారం గ్రామంలో పర్యటించి, ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. గ్రామంలో మౌలిక వసతులు కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు కేటాయించిందన్నారు. త్వరలోనే గ్రామంలో సీసీరోడ్లు, మురుగునీటి నిర్వహణకు డ్రైన్లు, నీటి వసతి కోసం బోరుబావుల నిర్మాణానికి కృషి చేస్తానని, హనుమాన్ మందిరాన్ని, జగదాంబ దేవి ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి గతంలో సమస్య తీసుకు వెళ్లగానే నూతన గ్రామ పంచాయతీకి అనుమతులు ఇచ్చిందని పేర్కొన్నారు. త్వరలోనే గ్రామానికి బీటీరోడ్డు వేయిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాశీరాం, బలిరాం, రాజేష్, గ్రామ పటేల్, నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్

ఉట్నూర్‌రూరల్: నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రాన్యూల్స్ ఫార్మా కంపెనీ వారి నియమకాలు జరిగాయని అన్నారు. కంపెనీ ప్రతినిదులు మోహన్‌బాబు, ఋత్విక్, వినోద్, మహేశ పాల్గొని అభ్యర్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించారు. మొత్తం 75 మంది అభ్యర్థులు హాజరు కాగా, ఏడుగురు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ షేక్ ముజీబ్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ నర్సింగ్‌రావు, పీడీ డాక్టర్ అనిత, రవీందర్, కరుణాకర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే కేటీఆర్ అరెస్ట్



మాట్లాడుతున్న జోగు రామన్న

- మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే కేటీఆర్ అరెస్టు అంటూ కొత్త నాటకాన్ని తెరలేపుతున్నారని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అండగా ఉండాల్సిన స్థానిక బీజేపీ ఎమ్మెల్యే కాంగ్రెస్‌కు కొమ్ముకాస్తూ ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ నాయకులను ఓడించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పేందుకు కార్యకర్తలతో పాటు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని మండిపడ్డారు.. గ్రామ కమిటీలు గడపగడపకు వెళ్లి కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను ప్రజల ముందు ఉంచాలన్నారు. ఈ సమావేశంలో యాసం నర్సింగరావు, ఇజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, సేవ్వా జగదీష్, గంద్రత్ రమేశ్, రాజన్న, సతీష్ పవర్, గంబెర్ టక్రే, మారిశెట్టి గోవర్ధన్, లింగారెడ్డి, మెస్రం పరమేశ్వర్, కుమ్రా రాజు, వేణు యాదవ్, బట్టు సతీష్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుల నియామకం



రవీందర్‌ను సన్మానిస్తున్న నాయకులు



రమేశ్‌కు స్వీటు తినిపిస్తున్న నాయకులు

బోథ్: బోథ్ మండల బీజేపీ అధ్యక్షుడిగా సొనాల గ్రామానికి చెందిన బోరె రవీందర్ నియమించారు. తనకు మరోసారి మండల అధ్యక్షుడిగా నియమించినందుకు జిల్లా అధ్యక్షులు పతంగే బ్రహ్మానందం, పార్లమెంట్ అధ్యక్షులు నగేశ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

తాంసి: బీజేపీ పార్టీ భీంపూర్ మండల అధ్యక్షుడిగా అర్లి(టి) గ్రామానికి చెందిన అంకం అశోక్‌ను గురువారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర పార్టీ ఆర్‌వో పల్లి గంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పతాంగే బహ్మనంద్ సమక్షంలో అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. జిల్లా నాయకులు, కార్యకర్తలు శాలువాతో సన్మానించారు.

ఇచ్చోడ: మండల బీజేపీ అధ్యక్షుడిగా గురవారం మండల కేంద్రానికి చెందిన తహరే రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగాధర్, జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందంలు రమేశ్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాధవ్ అమ్టె, కథం బాబారావు, గుమ్మడి భీంరెడ్డి, కొల్లూరి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



సంతోష్ సింగ్



అశోక్

నేరడిగొండ: బీజేపీ మండల అధ్యక్షుడిగా మరోసారి సాబ్లే సంతోష్ సింగ్ ఎన్నికయ్యారు. సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా మండల అధ్యక్షుల జాబితాను రిటర్నింగ్ అధికారి పల్లె గంగారెడ్డి గురువారం విడుదల చేశారు. నేరడిగొండ మండల అధ్యక్షుడిగా ప్రస్తుత అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్ మరోసారి నియమితులయ్యారు. దీంతో పలువురు ఆయనకు అభినందనలు తెలియజేశారు.